

# నథింగ్ బట్ ట్రూత్

— గోలపల్లి రాజేశ్వర్

**"నాకు .... మళ్లీ పెళ్లా?" నేను నిస్తేజంగా నవ్వాను.**

**"అదేంట్రా అలా అంటావ్? ఏం... ఇపుడు నీకేవంత వయసు మీరిపోయిందని?" కృష్ణమూర్తి నా భుజంమీద చిన్నగా తడుతూ అన్నాడు.**

**"వచ్చే ఏప్రిల్‌కి నలభై ఆరునిండి నలభయ్యేడొస్తయ్?"**

"అయితేమాత్రం?" అన్నాడు కృష్ణమూర్తి అదేవంత పెద్దవయసు కాదన్నట్టు ఎక్స్‌ప్రెషనిస్తూ.

నేను మాట్లాడలేదు.

"నువ్వు ఊఁ అను. నీకు సంబంధం చూసే బాధ్యత నాది"

"సంబంధాలు దొరకవని కాదు..." నేను నసిగాను.

"మరి?"

"నాకిష్టంలేదంతే" అంటూ ముఖం పక్కకి తిప్పేసుకున్నాను.

"అయితే జీవితాంతం తోడులేకుండా ఇంకిలాగే ఉండిపోతావా?" మళ్లీ నా భుజాలు పట్టుక్కుదుపుతూ అడిగాడు కృష్ణమూర్తి .

"తోడు లేకపోవడం ఏంటి? నేనేవన్నా ఒంటరివాణ్నా? ఒకరు కాదు ఇద్దరు కాదు... ముగ్గురు...ముగ్గురు పిల్లలున్నారు" అన్నాను నవ్వేస్తూ.

"కానీ వాళ్లని సక్రమంగా పెంచి పెద్దచెయ్యాల్సిన బాధ్యతని నువ్ సక్రమంగా నిర్వర్తించగలవా? ఒక్కసారి ఆలోచించు" అన్నాడు.

నిజమే. నా పిల్లలింకా చిన్నవాళ్లే. పెద్దాడికి పధ్నాలుగేళ్లు. రెండోవాడికి పన్నెండేళ్లు. చివరిది అమ్మాయి. దానికి పదేళ్లు. సుమతితో నాది చాలా లేట్ మారేజి. నా ముప్పైరెండో ఏట నేను సుమతి మెడలో తాళి కట్టాను. పెళ్లయిన ఏడాదికి మా పెద్దాడు పుట్టాడు.

సుమతి... నేను ఏరికోరి చేసుకున్నది కాకపోయినా పెళ్లయ్యకమాత్రం నాకు అత్యంత ప్రియమైన వ్యక్తిగా మారిపోయింది. ఒక్క అందం తప్పిస్తే ఒక మంచిభార్యకు ఉండాల్సిన లక్షణాలన్నీ సుమతిలో పుష్కలంగా ఉన్నాయి. అన్ని విషయాల్లోనూ నా కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ- ముఖ్యంగా ఒక దాసిలా అహర్నిశలూ నాకు సేవలు చేస్తూ రెండేళ్లకో కానుపు చొప్పున ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చి నా జీవితానికి పరిపూర్ణతను సిద్ధింప చేసిన సుమతి... నా దురదృష్టం కొద్దీ ఏడాది క్రితం కేన్సర్ వ్యాధితో మరణించింది.

నేనొక ప్రభుత్వోద్యోగిని అదైనా గుమస్తాగిరీయేం కాదు. ఆఫీసరు క్యాడరు. హోదాకీ, డబ్బుకీ లోటులేదు. పిల్లలు ముగ్గురూ శ్రద్ధగా చక్కగా చదువుకుంటున్నారు. ఇంటిపనీ వంటపనీ చేసి పెట్టడానికి పనిమనిషి ఉండనే ఉంది. ఇంక నేను వాళ్లని పెంచలేకపోవడం ఏమిటి? కేవలం వాళ్లని పెంచడానికే అయితే నాకు ఆడతోడు

## అశరీరం

గాలి వాటం కదా
వాలుపటాన్ని కదా
తేలిపోయే పాటని కదా
ఆ ఏదో గాలి కబురిని కదా
కేవలం ఓ నోటిమాటని కదా
అనే కదా ఎవరు వింటారులేననేకదా
ఇంతజేసీ ఇంకెవరు కంటారులేననే కదా
ఏదోలే ఎక్కడికో వెళ్లిన వాహ్యాళి
వాక్యాన్ననే కదా
తేలిపోతోన్నాననే కదా మునిగిపోతానో
తెలీకనే కదా
తెలిమి లేకనే కదా
మీ ఎవరి మనోగగనాల్లోకీ రాకూడదనే
కదా
ఇద్దరూ నిద్రముద్రలే కదా
తెలీనితనమనే కదా
నేనెవరి జోలికీ శొంఠికీ రాలేదు
కదానిన్నాళ్లూనూ

స్వప్నభంగవాక్య
విన్యాసంలో కావ్యం
జారిపోయే అశరీరాన్ని కదా
మీ నిశ్శబ్దంలో మీ ప్రక్కనే జారికదా
కేవలం ఓ నోరు జారాను దరి
జేరనానికదా
ఏదో ఓ అర్ధశతాబ్దం పాటు ఓ అరవిరిసిన
ఈ శతాబ్దాన్ని నిక్కచ్చిగా ధరించాను
నిక్కరులా
ఎంతజేసినా ఎవరు చూడొచ్చారులేననే
కచ్చితో
ఎంత చెప్పినా ఆత్మలాల్చీ
తిరగేసినపుడెన్ని చిల్లుల్లో కదా

హృదయాలు కదా అవన్నీ
ఉలిక్కిపడతాయి కదా ఎంతన్నా
ఏదో ఒక రేడియో స్టేషన్లో సంగీతవిద్యుత్
భంగం
వాక్యంలో నామవాచకాలు
జారిపోయి కావ్యం రాలిపోయి
నా ఆత్మ లాల్చీ చిల్లుల్లోంచి

దీనగానప్రవాహం ఎన్నాళ్లయినా
వార్తలో వ్యాఖ్యలో
సంగీతమో సముందరమో

స్వరాలలోని సుమసరాలో పరాగాలో
భూకంపాల మహాసర్పాలో నదీనదాల
నిర్దయలలో తుఫానుల పెనుగాలుల
వీచిన
పర్వతాల ఎగొసెగల భుగభుగలో గానీ
ఆకలి చూపులలోని పెనుచీకటి
కేకలవేవోగానీ
లోలోపలి చావులలో తెలివెలుతురులలో
పారేసిన చనుచీకని వెలిశిశువులలో
చెప్పానా లేనా మీకు
విన్నారు కారు ఎన్నడూ
ఓ ఎత్తైన లిపిలోంచి అక్షరాలు
పతనమవుతూన్నా
ఓ దేవత మహోన్నత ఫాలభాగం మీద
శిలాక్షరాలు
చెక్కి ఉన్నాయని
చెప్పినా విన్నారు కారు!

'మో'

---

అవసరం లేనట్టే. మరొకందుకు ఆడతోడు అవసరమా అంటే అదీలేదు.. సుమతి జ్ఞాపకాలు చాలు. శేష జీవితాన్ని గడిపేయడానికి కోరికలతో కి(రెక్కిపోయే వయసేం కాదుగదా?

అందుకే నేను పునర్వివాహం మాట తలపెట్టలేదు. ఇపుడు కృష్ణమూర్తేనే కాదు. ఇంతకుముందుకూడా చాలామంది కదిపిచూశారు నాదగ్గర ఆ విషయం.

అందరికీ ఏం చెప్పానో ఇపుడు కృష్ణమూర్తికి అదే చెప్పాను.

అయితే అందరిలా ఒక పట్టాన వదిలిపెట్టలేదు ఇతను.

"ఏం, ఎందుకని ఇష్టంలేదు? అపుడే అంత ముసలాడి వైపోయావా?" అంటూ నిగ్గదీశాడు.

రోషపడాల్సిన విషయమే. ఉక్రోష పడాల్సిన విషయమే. అయినా తమాయించుకున్నాను.

మగతనాన్ని సవాలు చేస్తూ మాట్లాడితే కాటికి కాళ్లు చాచుకున్న ముసలాడి కైనా కోపం వచ్చి తీర్తుంది. కానీ నాకుమాత్రం కోపం రాలేదు. కారణం అతనే ఉద్దేశ్యంతో నన్ను బలవంతం చేస్తున్నాడో నాకు తెలుసు.

"ఇక్కడ నేను ముసలాడినై పోవడం అన్నది కాదు ప్రశ్న. మగాడికి ముసలితనం ఏముంటుంది? ఒంట్లో ఊపిరున్నంతకాలం ఆ కోరిక ఇంతో అంతో ఉండనే ఉంటుంది. కానీ నేనిపుడు మళ్లీపెళ్లి చేసుకోవడం అందుకోసమే అయితే అంతకన్నా తెలివితక్కుతనం మరొకటుండదు. ఎక్కడో ఓ చోట కక్కుర్తి పడితే సరిపోయేదానికి పెళ్లిదాకా వెళ్లటం చాలా అనవసరం. లేదూ నువ్వన్నట్టు పిల్లల్ని పెంచడానికే మళ్లీ పెళ్లనుకుంటే- అదీ అవివేకమే! నా పిల్లలు మరీ చిన్నవాళ్లేం కాదు. వాళ్ల పనులన్నీ వాళ్లే చేసుకోగలిగే స్థితిలో ఉన్నారు. అనవసరంగా వాళ్లకి సవతి తల్లిని తెచ్చి పెట్టి- ఇబ్బందులు పాలు చెయ్యడం దేనికి?" అన్నాను ప్రశాంతంగా.

"అయితే సవతి తల్లులందరూ మొదటి భార్య పిల్లల్ని కష్టపెట్టి తీర్తారంటావా?" అన్నాడు కృష్ణమూర్తి- నీ అభిప్రాయం తప్పు సుమా? అన్నట్టుగా నాకేసి చూస్తూ.

"అందరూ కష్టపెట్టకపోవచ్చు. కానీ కొందరు కష్టపెడతారుగదా? ఆ వచ్చే ఆవిడ అలాంటిదే కాకూడదని రూలేముందీ?" అన్నాను సిగరెట్టు అంటిస్తూ.

"నోనో.. నీకు మంచి అమ్మాయిని చూసి పెట్టే బాధ్యత నాది" అన్నాడు కృష్ణమూర్తి నాభుజం తడుతూ.

"ఎవరా మంచి అమ్మాయి? నీ దృష్టిలో అలాంటి వాళ్లెవరయినా ఉన్నారా?" తెలిసినా అడిగాను. అతనేమంటాడో చూద్దామని.

నేనూహించినట్టే కృష్ణమూర్తి మొదట కొస్త కంగారుపడి ఆ వెంటనే తమాయించుకున్నాడు.

"ఉంది" అన్నాడు, చూపుని కాస్త పక్కకి మరలుస్తూ.

"ఎవరూ?"

"మా పెద్దచెల్లి ఊర్మిళ".

నేనూహించింది అదేకాబట్టి నేనేం బిత్తరపోలేదు. పైగా "మీ ఊర్మిళకెన్నేళ్లు" అని నింపాదిగా అడిగాను.

"ముప్పై రెండేళ్లు..." చెప్పాడు.

"అంటే నాకన్నా పదిహేనేళ్లు చిన్నది. తనని నాకిచ్చి చెయ్యాలనుకోవడం భావ్యమా?"

నా ప్రశ్నకి కృష్ణమూర్తి భారంగా నవ్వాడు. "మరెవ్వరికిచ్చి చెయ్యమంటావ్? పాతికేళ్ల కుర్రాడికిచ్చి చెయ్యమంటావా? దానికెలాగూ వయసు మీరిపోయింది గనక- దానికి పెళ్లంటూ చేస్తే రెండో పెళ్లివాణ్నే చెయ్యాలి. దాని ఈడుకి సరిపోవాలంటే ముప్పై అయిదేళ్లు దాటినవాడై ఉండాలి. ఆ వయసులో ఉండే బ్రహ్మచారులు నాకెక్కడ దొరుకుతారు?

"అందుకని...?"

"ఎలాగూ రెండో పెళ్లివాణ్నే చెయ్యాలి కాబట్టి ఆ చేసేదేదో నీకిచ్చి చేస్తే అది సుఖపడుతుందని నా నమ్మకం. ప్లీజ్... కాదనకు" అన్నాడు కృష్ణమూర్తి నా రెండు చేతులూ పుచ్చుకుంటూ.

కృష్ణమూర్తి నా కొలీగ్ మాత్రమేకాదు. అంతకు మించి మంచి స్నేహితుడు. నాకు వాళ్ల కుటుంబ సభ్యులందరితోనూ పరిచయం ఉంది. ఊర్మిళకూడా నాకు బాగా తెలుసు. బాగా లావుగా, నల్లగా వికారంగా ఉంటుంది. దానికి తోడు మెల్లకన్ను. ఆ కారణంగానే కృష్ణమూర్తి ఎన్నెన్ని ప్రయత్నాలు చేసినా కూడా ఆమెకు సకాలంలో వివాహం చెయ్యలేకపోయాడు. కృష్ణమూర్తికి మొత్తం నలుగురు చెల్లెళ్లు. ఊర్మిళ తరువాతి అమ్మాయిలిద్దరూ రెండేళ్లక్రితం గండిపేట చెరువుకి పిక్నిక్ వెళ్లి దురదృష్టవశాత్తూ నీళ్లల్లో మునిగి చనిపోయారు. ప్రస్తుతం ఆఖరి అమ్మాయి వైశాలికూడా పెళ్లికెదిగుంది కానీ అక్కకి పెళ్లి చేయకుండా చెల్లెలికి చెయ్యడం ఎలా అన్నది ప్రస్తుతం కృష్ణమూర్తిని వేధిస్తున్న సమస్య.

అన్ని విషయాలూ తెలిసినవాణ్ణే కాబట్టి- "ఊర్మిళని ఎలాగోలా వదిలించుకోవాలని చూస్తున్నావు. అంతే కదూ?" అన్నాను.

"ఛఛ! అదేంకాదు. ఊర్మిళకూడా దీనికి మనస్ఫూర్తిగానే ఒప్పుకుంది..." అన్నాడు, ఒకింత నొచ్చుకోలుగా చూస్తూ.

"ఏంటీ! ఈ సంగతి ఊర్మిళతో కూడా చెప్పావా?" నేను ఆశ్చర్యంగా అడిగాను.

"అవును. ఇంట్లో దీన్ని గురించి మాట్లాడుకున్నాకే- నీ దగ్గరకొచ్చాను."

"ఊర్మిళ ఏమంది?"

"నువ్విష్టపడితే తనకీ ఇష్టమేనంది.."

నాకు నమ్మబుద్ధి కాలేదు. "నేనొకసారి ఊర్మిళతో మాట్లాడొచ్చా?" అన్నాను అసంకల్పితంగా.

"ష్యూర్... ఇవ్వాళే మాట్లాడు" అన్నాడు కృష్ణమూర్తి.

oooo

"ఏంటి ఊర్మిళా! మీ అన్నయ్య నాతో చెప్పింది నిజమేనా?"

"నిజమే" అంటూ తల దించుకుంది ఊర్మిళ.

"నువ్ నాకన్నా పదిహేనేళ్ల చిన్నదానివి. నేను జీవితంలో ఒకసారి పెళ్లై అన్నీ అనుభవించేసిన వాడిని. నాతో ఏం సుఖపడగలవని నన్ను చేసుకోవడానికి ఒప్పుకుంటున్నావు?" వద్దనుకుంటూనే ఒకింత బాధగా అడిగాను.

అసలు కృష్ణమూర్తి అలా ఇంటికి వెళ్లగానే ఇలా ఊర్మిళను మా ఇంటికి పంపేస్తాడని అనుకోలేదు.

"చూడండి అంకుల్" అని, వెంటనే "సారీ!" అంది ఊర్మిళ.

అలవాటైన పిలుపు ఇంతలోనే మారిపోతుందా?

"పర్వాలేదు చెప్పు.." అన్నాను.

"నా పరిస్థితి మీకు తెలుసు. మా అన్నయ్య పరిస్థితీ మీకు తెలుసు. నేను మీతో ఎంతవరకు సుఖపడగలనో చెప్పలేనుగానీ, కష్టపడకుండా ఉండగలనని చెప్పగలను. ఆంటీ ఏమంత అందంగా ఉండకపోయినా మీరు తనని ఎంత అపురూపంగా చూసుకునేవారో నాకు తెలుసు. కళ్లారా చూశాను కదా? అందులో నూరవ వంతు ప్రేమని మీరు నామీద కనబరచగలిగితే, చాలు. నేను సుఖపడకపోవడం అన్న ప్రశ్నేముంంటుందీ?" అంది ఊర్మిళ.

కొద్దిక్షణాలపాటు నాకు నోటివెంట మాట రాలేదు. "అయితే మాత్రం?" అన్నాను- ఇంకేమనాలో తోచక.

అంతలో...."అయ్యగారూ! పనంతా అయిపోయింది. నన్ను వెళ్లమంటారా?" అంటూ వచ్చింది మా పనిమనిషి సుశీలమ్మ.

"వెళ్లు సుశీలమ్మ! అన్నట్టు అన్నం చాలా మిగిలిపోయినట్టుంది కద! తీసుకెళ్లు. రాత్రికి మళ్లీ ఎలాగూ వంట చేస్తావుగా?" అన్నాను.

దాంతో ఆమె తిరిగి కిచెన్‌లోకి వెళ్లి, కాసేపట్లో చేతిలో అన్నం గిన్నెతో తిరిగొచ్చి "వెళ్లొస్తానయ్యగారూ" అని నానుండి సెలవు తీసుకుని వెళ్లిపోయింది.

"అంత అన్నం ఆ పనిమనిషికెందుకిచ్చారు?" ఆమె అలా గడపదాటగానే అడిగింది ఊర్మిళ.

"అదేం ప్రశ్న ఊర్మిళా? అంత అన్నం వేస్ట్ చెయ్యడం దేనికని ఇచ్చేశాను. వృథాగా పారేస్తే ఏమొస్తుంది?" అన్నాను నేను, తన ప్రశ్నకి ఒకింత ఆశ్చర్యపోతూ.

"అలాగే మీ భావిజీవితాన్నికూడా వృథా చెయ్యకండంకుల్! అది... అది.. నాకు పని కొస్తుంది" అంది ఊర్మిళ చప్పున తల దించుకుంటూ.

కడుపులో చెయ్యిపెట్టి కెలికినట్టే అనిపించింది నాకు.

oooo

మరో మూడు నెలల తర్వాత... ఊర్మిళ మెడలో మూడుముళ్లు వేస్తున్నపుడు... నేను గిల్టీగా ఫీలవ్వలేదు.

■

## జాకీర్‌హుస్సేన్

**అ**తని పది వేళ్లూ
తబలామీద
పంచకావ్యాలవుతాయ్!!

**ఆ**రేబియన్ అశ్వం
మెక్సికోలో దౌడు తీస్తున్నట్టూ!
లిబర్టీ స్టాచ్యూ చేతిలో
కాగడా బదులు
కంజీర ఉన్నట్లూ

**ఈ**జిప్షియన్ పిరమిడ్లమీద
వడగళ్లు పడ్తున్నట్టూ
నక్షత్రాల్ని దోసిట్లో పట్టి
తాజ్‌మహల్ మీద
ధారగా పోస్తున్నట్టూ...

**కా**శ్మీర్ లోయల్లో
ఊయలలూగినట్టూ
హిందూమహాసముద్రంలో
ఈత కొడ్తున్నట్టూ...

**న**యాగరా స్వరపాతంలా
ఆఫ్రికా ఊటూ మార్మికనాదంలా!
కోనసీమ సామగానంలా
హిమాలయంలో యోగిధ్యానంలా

**ఒ**ళ్లంతా నెత్తురు బదులు
అత్తరు ప్రవహిస్తున్నట్టూ
కళ్లనిండా ఆనందబిందువులూ
చెవుల్నిండా అమృతధారలూ

**తా**న్‌సేనూ, త్యాగరాజూ
ఎమ్మెస్సూ-జేసుదాసూ
అందర్నీ స్మరిస్తూ-స్పృశిస్తూ
ఆకాశం అంత ఎత్తైపోయిన
జాకీర్ హుస్సేన్!!

**సూ**ర్యుణ్ని కుడిచేత్తోనూ
చంద్రుణ్ని ఎడంచేత్తోనూ
తబలా చేసి దరువేస్తూ!!

**తనికెళ్ల భరణి**